కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

# BNS
BHARAT NEWS SPECTRUM

ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -133 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 23-05-2026 శనివారం పేజీలు : 4

## మహిళా శక్తికి
# ప్రజా పాలన అండ

- వారం రోజుల మహిళా వారోత్సవాలు
- గ్రామీణ మహిళల అభివృద్ధికి భారీ ప్రణాళిక
- మహిళా సంఘాలకు కొత్త ఆర్థిక అవకాశాలు
- సీఎం చేతుల మీదుగా ఇంక్యుబేటర్ ప్రారంభం
- మహిళల సాధికారతకు ప్రభుత్వం బిగ్ ప్లాన్
- మహిళా సంఘాలకు రుణాలు, జీవనోపాధి యూనిట్లు
- మహిళల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- సౌర విద్యుత్ ప్లాంట్లతో మహిళలకు కొత్త దారి
- టీన్ ఏజ్ బాలికలకు మాక్ పార్లమెంట్
- మహిళల భద్రత, ఉపాధిపై ప్రత్యేక దృష్టి
- మహిళా సంఘాలను ఉత్పాదక శక్తులుగా తీర్చిదిద్దే లక్ష్యం



**న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్):** మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నెల 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు నిర్వహించనుంది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, సంస్థలు, యువతులు, బాలికలు, దివ్యాంగులు, వృద్ధులతో సహా అన్ని వర్గాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ వారం రోజుల పాటు విభిన్న కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధుల విస్తరణ, సామాజిక భద్రత, ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్, రుణమేళాలు నిర్వహించనున్నారు.

సీఎం చేతుల మీదుగా ప్రారంభం

మే 29న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేకంగా మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం ఇంక్యుబేటర్ ప్రోగ్రాం ప్రారంభించి, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమం నిర్వహించనుండటం ఈ వారోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మహిళా సంఘాలకు ఆర్థిక అవకాశాలు విస్తరించే దిశగా ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుంది. మహిళా సంఘాలను కేవలం పొదుపు సమూహాలుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఉత్పాదక శక్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. బ్యాంకురుణాలు, జీవనోపాధి యూనిట్లు, సూక్ష్మ పరిశ్రమలు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులను గ్రామ స్థాయికే తీసుకెళ్తున్నామని చెప్పారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబాలు బలపడటమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని పేర్కొన్నారు.

మిగతాది 2 లో..

## ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం
### హరీష్ రావు సంచలన ప్రకటన




## దేశంలో మరో సమర శంఖం
### ఏపీతో సహా 24 స్థానాలకు నోటిఫికేషన్




**న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్):** రాజ్యసభకు సంబంధించి దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న 24 స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 10 రాష్ట్రాల పరిధిలోని ఈ స్థానాలకు జూన్ 1న అధికారికంగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది.

## కోస్తాకు అత్యంత ఎండల ముప్పు
## హెచ్చరించిన ఐఎండీ




**న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్):** తెలుగు రాష్ట్రాల్లో ప్రజలను సూర్యుడు తన ప్రతాపంతో బెంబేలెత్తిస్తున్నాడు. ఓ వైపు తీవ్రమైన ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంటే.. మరోవైపు వడగాలులు వీస్తున్నాయి. దీంతో చిన్న పిల్లల నుంచి అన్ని వయసుల వారు నానా నరకయాతన అనుభవిస్తున్నారు. 10 నిమిషాలైనా బయటికెళ్లాలంటేనే జంకుతున్నారు. తప్పనిసరిగా ఉద్యోగాలు, పనులకు వెళ్లేవారు మినహా.. మిగతావారు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

## తెలంగాణలో భారీగా ఉద్యోగాల భర్తీ
### ఏకంగా 15,982 పోస్టులు, మహిళలకు మాత్రమే ఛాన్స్

**న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్):** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులైన మహిళలకు ముఖ్యగమనిక.. త్వరలోనే భారీగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభంకానుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీగా ఉద్యోగలను భర్తీ చేయనున్నారు.. మొత్తం 15,982 పోస్టులను భర్తీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీకి ఈ ఏడాదిలోనే నోటిఫికేషన్ జారీ చేయనునున్నారు. అంగన్‌వాడీలలో కొంతమందికి ప్రమోషన్లు, మరికొందరు రిటైర్ అవుతున్నారు. ఈ మేరకు 2025-2026నాటికి ఉన్న ఖాళీలను పరిగణలోకి తీసుకుంటున్నారు. 2025-26 ఏడాది నాటికి పదోన్నతులు, పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీలను పరిగణనలోకి తీసుకున్నారు. కొత్తగా ఏర్పడిన 708 ఉద్యోగాలను కూడా కలిపి 15,982 పోస్టులు భర్తీ చేయనున్నారు.వీటిలో హెల్పర్స్ పోస్టులు 12,882 ఉన్నాయి.. టీచర్ పోస్టులు 3,100 ఉన్నాయి.




రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే.. సుమారు 71,562 మంది పనిచేస్తున్నారు. వీరిలో టీచర్లు, వర్కర్లు ఉన్నారు.అంగన్‌వాడీలలో గత మూడేళ్లుగా పదవీ విరమణ, సిబ్బందికి సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు వచ్చాయి.

## ఆధ్యాత్మికత ముసుగులో
# భారీ దోపిడీ
### బాబా అశోక్ ఖారత్‌ను అరెస్ట్ చేసిన ఈడీ




## తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ లైతే పిల్లలకు
# రిజర్వేషన్లు అవసరమా?
### : సుప్రీంకోర్టు




**బిఎన్ఎస్ :** రిజర్వేషన్ల అంశంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులుగా ఉన్న పిల్లలకు వీటి అవసరమేంటని ప్రశ్నించింది. వెనకబడిన తరగతుల్లోని సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన వర్గాలకు (క్రీమీ లేయర్) రిజర్వేషన్ ప్రయోజనాలకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ జరిగింది.

"తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్‌లు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నారు. ఇలా ఒక స్థాయికి చేరుకున్న వ్యక్తుల్ని మినహాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి.

## 'ప్రజలపై ఆర్థిక
# ఒత్తిడి పడొద్దు'
### కీలక రంగాలపై ప్రధాని మోడీ స్పెషల్ ఫోకస్!




**న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్):** ఐదు దేశాల పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగొచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలకమైన కేబినెట్ భేటీలో పాల్గొన్నారు. గురువారం రాత్రి కేంద్ర మంత్రిమండలితో నాలుగున్నర గంటలపైగా సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. తొమ్మిది ముఖ్యమైన మంత్రిత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలను ఈ భేటీలో ప్రధానికి సమర్పించాయి. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా దేశ అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు అవసరమైన పాలనా ప్రాధాన్యతలు, సంస్కరణలు, భవిష్యత్తు కార్యాచరణపై వ్యవసాయం, అడవులు, కార్మిక, రోడ్డు రవాణా, కార్పొరేట్ వ్యవహారాలు, విదేశాంగ, వాణిజ్యం, విద్యుత్ శాఖలు వివరణాత్మక ప్రెజెంటేషన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. వీరితోపాటు కేబినెట్ సెక్రెటరీ, నీతి ఆయోగ్ కూడా ప్రెజెంటేషన్స్ ఇచ్చాయి. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ అనేది కేవలం నినాదం కాదని, అది ప్రభుత్వ కమిట్‌మెంట్ అని మంత్రులకు చెప్పినట్లు సమాచారం.

## కాక్‌రోచ్ జనతా పార్టీలో
# ప్రకాష్ రాజ్ ఎంట్రీ..




**బిఎన్ఎస్:** సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' లోకి ఇప్పుడు సెలబ్రిటీల ఎంట్రీ మొదలైంది. వైవిధ్యభరిత నటుడు ప్రకాష్ రాజ్ తాజాగా ఈ డిజిటల్ ఉద్యమంలో భాగస్వామి అవుతూ సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వీడియోను పంచుకున్నారు. తనను తాను ఒక "బొద్దింక"గా అభివర్ణించుకుంటూనే.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.

# ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం: హరీష్ రావు సంచలన ప్రకటన



న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్): తెలంగాణ రాజకీయాల్లో 'ఫ్యూచర్ సిటీ', 'ఫార్మా సిటీ' ప్రాజెక్టుల చుట్టూ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న హరీశ్ రావు అక్కడ మీడియాతో మాట్లాడాతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 'ఫ్యూచర్ సిటీ'ని రద్దు చేస్తామని సంచలన ప్రకటన చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ పార్టీ కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే వచ్చిన వెంటనే గతంలో ఉన్న 'ఫార్మా సిటీ' ప్రాజెక్టును మళ్లీ రీస్టోర్ (పునరుద్ధరిస్తాం) చేస్తాం. ఫార్మా సిటీ గనుక వస్తే లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కానీ, ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే ఆ పేరు ఎక్కడ బీఆర్ఎస్‌కు వస్తుందోననే ఈర్ష్యతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోంది. ఎవరేం చేసినా, అక్కడ ఉన్నది ఉన్నట్టుగా ఫార్మా సిటీనే వస్తుందని రాసి పెట్టుకోండి" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అది ఫార్మా కాదు.. ఫ్యూచర్ కాదు.. 'ఫార్మర్స్ సిటీ': రఘునందన్ రావు కౌంటర్

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామన్న హరీష్ రావు ప్రకటనపై మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తీవ్రంగా స్పందించారు. అది ఫార్మా సిటీనో, ఫ్యూచర్ సిటీనో కాదని.. అసలైన 'ఫార్మర్స్ సిటీ' (రైతుల నగరం) అని ఆయన కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చారు. కేవలం ప్రాజెక్టుల పేర్ల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పాకులాడుతున్నాయని విమర్శించారు. రఘునందన్ రావు మాట్లాడుతూ.. "పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్. అక్కడ ఒక్క కంపెనీనైనా ఎందుకు పూర్తి చేయలేకపోయింది? ఆ ప్రాంతంలో పెట్టుబడులు వస్తాయని, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం గతంలో పర్యావరణ అనుమతులు ఇచ్చింది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే.. ఆ ప్రాంతాన్ని మొదట 'ఫార్మర్స్ సిటీ'గా, ఆ తర్వాతే 'ఫార్మా సిటీ', 'ఫ్యూచర్ సిటీ'గా సమగ్రంగా తీర్చిదిద్దుతాం" అని స్పష్టం చేశారు. ఒకవైపు ఫార్మా సిటీ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ కింద మార్చుతోందన్న ఆరోపణలు. మరోవైపు ఫ్యూచర్ సిటీ రద్దుపై బీఆర్ఎస్ హెచ్చరికలు, వీటన్నింటి నడుమ రైతుల పక్షాన బీజేపీ నిలబడతామనడంతో తెలంగాణలో ల్యాండ్ పాలిటిక్స్ మరింత హీటెక్కాయి.

# 'ప్రజలపై ఆర్థిక ఒత్తిడి పడొద్దు'

## కీలక రంగాలపై ప్రధాని మోడీ స్పెషల్ ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

సంస్కరణలపై దిశానిర్దేశం

అన్ని శాఖల్లో పరిపాలనా సంస్కరణల ఆవశ్యకత చాలా ఉందని ప్రధాని మోడీ నొక్కిచెప్పారు. ప్రభుత్వ పాలన అనేది కేవలం ప్రజల సంక్షేమం, పౌరుల సౌకర్యం చుట్టూనే సాగాలని స్పష్టం చేశారు. ఫైళ్ల కదలికలో వేగం పెంచాలని, అనవసరమైన ఆలస్యానికి తావులేకుండా ప్రభుత్వ పనితీరులో మరింత సమర్థతను ప్రదర్శించాలని మంత్రులను ఆదేశించారు. ప్రతి స్థాయిలోనూ నిబంధనలను సరళీకృతం చేస్తూ, తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అంచనాల్లో వెనుకబడిన శాఖలు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, క్షేత్రస్థాయిలో విధానాలను బలోపేతం చేయాలని ప్రధాని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అలాగే మంత్రులు కాంట్రవర్సీలకు దూరంగా ఉండి, ప్రజలకు ముఖ్యమైన అంశాలపై ప్రత్యేకమైన ఫోకస్ పెట్టాలని సూచించినట్లు తెలిపాయి.పశ్చిమాసియా సంక్షోభంపై..

ఈ భేటీలో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, దాని వల్ల ఎనర్జీ రంగంపై పడుతున్న ఒత్తిడిని ప్రధాని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రజలపై ఈ ఆర్థిక ఒత్తిడి సాధ్యమైనంత తక్కువ ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పిన ఆయన.. ఎనర్జీ, వ్యవసాయం, ఎరువులు, ఏవియేషన్, షిప్పింగ్, రవాణా తదితర కీలక రంగాలపై ప్రత్యేకంగా చర్చలు జరిపారని సమాచారం. అలాగే గడిచిన 12 ఏళ్ల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం సాధించిన చారిత్రాత్మక విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనకు సంబంధించిన వివరాలను, దీంట్లో సాధించిన కీలక ఫలితాలను మంత్రిమండలికి విదేశాంగ మంత్రి జైశంకర్ వివరించారు. ఈ అంతర్జాతీయ పర్యటన విజయవంతం కావడంపై, అలాగే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయంపై కేంద్ర మంత్రులంతా ప్రధానమంత్రికి అభినందనలు తెలిపారు. కాగా, ఇంధనం, రక్షణ, వాణిజ్యం, కీలక ఖనిజాల రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో పర్యటించిన ప్రధాని.. గురువారం నాడు ఢిల్లీ చేరుకున్నారు.


కేబినెట్ ప్రక్షాళన?

ఏడాది తర్వాత నిర్వహించిన కేంద్రమంత్రి మండలి సమావేశంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని, కొందరు మంత్రులకు ఉద్వాసన పలికి కొత్త ముఖాలను కేబినెట్‌లోకి తీసుకుంటారనే ప్రచారం జోరుగా జరిగింది. అయితే, బయటికి సమాచారం మాత్రం మంత్రుల పర్ఫార్మెన్స్, పశ్చిమాసియా సవాళ్లపై దీర్ఘ చర్చ జరిగినట్టు వస్తున్నది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై పెద్దగా సమాచారం రాలేదు. ఒకవేళ అలాంటి నిర్ణయాలు తీసుకుంటే ఒకట్రెండు నెలల్లో ఆ మార్పులు చోటుచేసుకోవచ్చనే చర్చ జరుగుతున్నది.

భారత్‌కు అవసరమైన చమురు అందిస్తాం: అమెరికా

భారత్‌కు ఎంత కావాలంటే అంత ఇంధనం అమ్మేందుకు అమెరికా సిద్ధంగా ఉందని యూఎస్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో అన్నారు. శనివారం నాడు తొలిసారి భారత పర్యటనకు వస్తున్న రూబియో.. ఇండియాకు మరింత పెద్ద ఇంధన సప్లయర్‌గా మారేందుకు యూఎస్ అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో చమురు మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్న వేళ ఆయన అ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'భారత్ ఎంత కొంటే అంత ఇంధనం అమ్మాలని అనుకుంటున్నాం. ప్రస్తుతం యూఎస్‌లో ఉత్పత్తి, ఎగుమతి చరిత్రాత్మక స్థాయిలో జరుగుతోంది. కాబట్టి మేం వారితో మరింత బిజినెస్ చేయాలనుకుంటున్నాం. దానికోసం చర్చలు కూడా కొంతకాలంగా జరుగుతున్నాయి. భారత దిగుమతుల్లో మేం మరింత పెద్ద పార్ట్ కావాలనుకుంటున్నాం' అని చెప్పారు. భారత్ తమకు చాలాగొప్ప భాగస్వామి అని, కాబట్టి ఈ పర్యటన చాలా ముఖ్యమని అన్నారు. మే 23 నుంచి 26 వరకు భారత్‌లో మూడ్రోజులు పర్యటించనున్న రూబియో.. కోల్‌కతా, ఆగ్రా, జైపూర్, న్యూఢిల్లీని సందర్శిస్తారు. ఎనర్జీ, డిఫెన్స్, ట్రేడ్, భద్రతలో భాగస్వామ్యంపై ఈ పర్యటనలో చర్చలు జరుగుతాయని అమెరికా అధికారులు తెలిపారు. కాగా, వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రొడ్రిగెజ్ వచ్చేవారం భారత్‌కు రానున్నట్టు చెప్పారు.

# నేపాల్ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక సిట్ ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సజ్జనార్



న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్): చోరీలు, దోపిడీలతో నగర ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న నేపాల్ దేశానికి చెందిన ముఠాలను పట్టుకునేందుకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)ను ఏర్పాటు చేశారు. ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ డానియల్ శాంతి కుమార్ నేతృత్వంలో ఈ సిట్ పనిచేస్తుందని సీపీ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ముగ్గురు ఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్‌లు, 17 మంది కానిస్టేబుల్‌లు ఈ సిట్‌లో పని చేయనున్నారు. ఈ టీం ఇప్పుడు ఇటీవల జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ ఐపీఎస్ భార్యను హత్య చేసి పరారీలో ఉన్న నేపాలి కల్పనా గ్యాంగ్‌తో ఇతర నేరాల్లో నిందితులుగా ఉన్న నేపాలి క్రిమినల్స్‌ను పట్టుకునేందుకు ఈ సిట్ నిరంతరం పనిచేస్తుందని పోలీస్ అధికారులు తెలిపారు. పలు సంచలనం రేపిన సంఘటనలకు పాల్పడిన నేపాలి క్రిమినల్స్ తప్పించుకుని తిరుగుతు పోలీసులకు పెద్ద సవాల్ విసురుతున్నారు.

# ఆధ్యాత్మికత ముసుగులో భారీ దోపిడీ బాబా అశోక్ ఖారత్‌ను అరెస్ట్ చేసిన ఈడీ



న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్): ఆధ్యాత్మికత, మతపరమైన ఆచారాల ముసుగులో వసూళ్లు, మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్వయం ప్రకటిత దొంగ బాబా అశోక్ ఖారత్ ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆయనకు ముంబైలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు అతనికి మే 26 వరకు ఈడీ కస్టడీ విధించింది. అయితే, ఈ ఏడాది మార్చిలో నాసిక్ పోలీసులు ఓ మహిళపై అత్యాచారం, మతపరమైన ఆచారాల పేరుతో పలువురిని దోపిడీ చేసినందుకు అశోక్ ఖారత్‌ను అరెస్ట్ చేసిన నేపథ్యంలో మనీలాండరింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అశోక్ ఖారత్ తనను తాను శివుడి అవతారంగా చెప్పుకుంటూ భక్తులను నమ్మించేవాడు. కేవలం ఒకే ఒక్క బాధితుడి నుంచి ఏకంగా రూ.5.62 కోట్లను వసూలు చేసి, ఆ డబ్బుతో లగ్జరీ మెర్సిడెస్ కారు, విదేశీ పర్యటనలు, అమెరికాలో విలాసవంతమైన వైద్య చికిత్స, ఫామ్‌హౌస్‌లను కట్టినట్లగా చేసినట్లు ఈడీ గుర్తించింది.

బినామీ ఖాతాలతో మనీలాండరింగ్..

అయితే, బాబా అశోక్ కారత్ తన ఆర్థిక అక్రమాలు బయటపడకుండా జాగ్రత్త పడ్డాడు. వేరే వారి పేర్లతో ప్రాక్సీ, బినామీ బ్యాంక్ ఖాతాలు, కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలను తెరిచి, బాధితుల నుంచి వసూలు చేసిన బ్లాక్ మనీని ఆయా ఖాతాల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా మార్చి విత్‌డ్రా చేశాడని తేలింది. ఈడీ దాడుల్లో రూ.13.92 కోట్ల నగదు, 5,500 అమెరికన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.5.11 లక్షలు, రూ.1.12 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.2.25 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్, విలాసవంతమైన మెర్సిడెస్ బెంజ్ కారు సీజ్ చేశారు.

# వైసీపీకి కొత్త పేరు పెట్టిన లోకేష్

మొదటి పేజీ తరువాయి



న్యూస్ డెస్క్, 22 మే (బిఎన్ఎస్): మంత్రి నారాలోకేష్ మరోసారి వైసీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలో టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి కొత్తగా తాను గొడ్డలి పార్టీ అని పేరు పెట్టినట్టు చెప్పారు. దానికి జగన్ ఫీల్ అయ్యారని, కానీ రప్పారప్పా అన్నది మీరే కదా అని ప్రశ్నించారు. జగన్ సినిమా చూపిస్తే ఎండ్ కార్డ్ వేసే బాధ్యత పసుపు సైనికులది అని వ్యాఖ్యానించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్ద దస్తగిరిని జగన్ మేనమామ చంపేసి, తమపై కేసులు పెడతామని బెదిరించారన్నారు.

జగన్ కు ఛీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇవ్వొచ్చన్నారు. బయట ముద్దులు పెట్టి లోపల గొడ్డలి పోట్లు వేస్తారని, జగన్ అద్భుత నటనకు భాస్కర్ అవార్డు గ్యారంటీ అంటూ ఎద్దేవా చేశారు.

కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ సైకోలు కుట్ర చేస్తున్నారంటూ మండిపడ్డారు. రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్మోహన్ రెడ్డి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి, చెల్లిని తరిమేశారని, బాబాయిని లేపేసి మరో చెల్లి కుటుంబానికి అన్యాయం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత జిల్లాను, నియోజకవర్గాన్ని మోసం చేశారని, 2019లో సొంత బాబాయిని లేపేశారన్నారు. గుండెపోటు అన్నారు, తర్వాత గొడ్డలివేటు బయటకు వచ్చిందని వ్యాఖ్యానించారు. తర్వాత దొంగపేపర్ లో నారాసుర రక్తచరిత్ర అని రాసి చంద్రబాబు చేతిలో కత్తి పెట్టి ఫొటో వేశారని అన్నారు. జగన్ ఎంత మోసగాడో ప్రజలకు అర్థమైందని వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో భారీగా ఉద్యోగాల భర్తీ

## ఏకంగా 15,982 పోస్టులు, మహిళలకు మాత్రమే ఛాన్స్

మొదటి పేజీ తరువాయి

కొంతమందికి వేరే శాఖలలో శాశ్వత ఉద్యోగాలు రావడంతో ఖాళీలు వచ్చాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో 22.33శాతం పోస్టులు ఖాళీ అయ్యాయి. త్వరలో శిశు సంక్షేమ శాఖ విద్యార్హతలు, నియామక విధానంపై క్లారిటీ ఇవ్వనుంది. ముందుగా అంగన్‌వాడీలలో కొత్త నియామక విధానానికి ఆమోదం తెలిపి.. ఆ తర్వాత జిల్లాల వారీగా నోటిఫికేషన్లు విడుద చేయనున్నారు. అంగన్‌వాడీల్లో ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటుగా 9వేల కేంద్రాలకు కరెంట్ కనెక్షన్లు, 7,700 వేల కేంద్రాలకు మరుగుదొడ్డి, మరో 5 వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తారు. 3,300 కేంద్రాలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. వెయ్యి కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. మొత్తం మీద తెలంగాణ సర్కార్ ఈ ఏడాది అంగన్‌వాడీల్లో ఉద్యోగాలను భర్తీ చేయనుంది. తెలంగాణలో నిరుద్యోగ మహిళలకు ఇది చక్కనైన అవకాశం.. త్వరలోనే ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేయనుంది. రాష్ట్రంలో ఈసారి ఏకంగా 15,982 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మహిళా శక్తికి ప్రజా పాలన అండ వారం రోజుల మహిళా వారోత్సవాలు

మొదటి పేజీ తరువాయి

**మే 25న సౌర విద్యుత్ ప్లాంట్లు, ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు**

- వికారాబాద్, ఖమ్మం, పెద్దపల్లి, అసిఫాబాద్ ప్రాంతాల్లో 0.5 మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభం.
- మహిళా సంఘాలచే నడిచే 450 ఆర్టీసీ బస్సుల ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమం.
- మహిళా సంఘాలకు బ్యాకింగ్ లోన్లు, వడ్డీ లేని రుణాలు విడుదల, ఉత్తమ సంఘాల సత్కారం.
- 2026-27 కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన.

మే 26 సామాజిక సమీకరణ దినం

- దివ్యాంగులు, వృద్ధ మహిళల ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు.
- టీన్ ఏజ్ బాలికలతో మాక్ పార్లమెంట్ నిర్వహణ.

మే 28 మౌలిక వసతుల నిర్మాణ కార్యక్రమాలు

- మహిళా సంఘ భవనాలు, వర్క్ షెడ్లు, మహిళా గోదాముల నిర్మాణాలకు శంకుస్థాపనలు.
- భూమి పూజలు, పనుల ప్రారంభోత్సవాలు.

**మే 29 రుణమేళాలు, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్**

- హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇంక్యుబేటర్ ప్రోగ్రాం ప్రారంభం.
- మండల స్థాయిలో రుణమేళాలు.
- మండల సమాఖ్యల ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు.
- కోళ్ల పెంపకం యూనిట్లు-500, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు.

**మే 30, 31 మహిళల భద్రత, మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు**

- జిల్లా మహిళా సమాఖ్య భవనాల ప్రారంభం.
- గుర్తించిన ప్రాంతాల్లో పెట్రోల్ పంపులకు భూమిపూజలు.
- జిల్లా సమాఖ్యల ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు.
- టీన్ ఏజ్ బాలికలకు సైకిళ్ల పంపిణీ.
- అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా చదువు నేర్చుకున్న మహిళలకు సత్కారం.
- పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ

# కోస్తాకు అత్యంత ఎండల ముప్పు.. హెచ్చరించిన ఐఎండీ

మొదటి పేజీ తరువాయి



రాత్రివేళల్లోనూ వేడి తగ్గకపోవడంతో చెమటలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు పిడుగులాంటి వార్త చెప్పింది.

కోస్తాంధ్రలో ఈ నెల 26వ తేదీ వరకూ ప్రచండ ఎండలు ఉంటాయని హెచ్చరించింది. మరో ఐదురోజులపాటు అతి తీవ్రమైన వడగాలులు, దక్షిణ కోస్తాలో అత్యధిక వేడి వాతావరణం ఉంటుందని తెలిపింది. ఈ క్రమంలో దక్షిణ కోస్తాలో 8 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరో 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మూడు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది. శ్రీకాకుళం, విజయనగరం మినహా అన్ని జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ సీజన్లో బాపట్లలో సాధారణంకంటే 7.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించింది.

మరోవైపు తెలంగాణలోనూ పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 26వ తేదీ వరకూ రాష్ట్రంలో తీవ్ర వడగాలులు వీస్తాయని, ఖమ్మం, పెద్దపల్లి జిల్లాల్లో హీట్ వేవ్ మరింత పెరుగుతుందని హెచ్చరించింది. ఈ రెండు జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్సున్నట్లు పేర్కొంది. కొన్ని జిల్లాల్లో మాత్రం తేలికపాటి వర్షాలు పడతాయని, రెండు మూడ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు విస్తరిస్తాయని చెప్పింది. ప్రస్తుతం యూపీ-ఛత్తీస్‌గఢ్- ఒడిశా మీదుగా ద్రోణి కొనసాగుతోందని, ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది.

# దేశంలో మరో సమర శంఖం.. ఏపీతో సహా 24 స్థానాలకు నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి

జూన్ 8 వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చని, మరుసటి రోజైన జూన్ 9న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు జూన్ 11లోపు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి గడువు విధించారు.

18న తుది ఘట్టం

ఇక జూన్ 18న ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ నిర్వహించి, అదేరోజు సాయంత్రం ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిచనుంది ఈసీ. ఏపీకి సంబంధించి నాలుగు రాజ్యసభ స్థానాలు ఈ జాబితాలో ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. ఈ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి.

జూన్ 26తో ముగియనున్న నలుగురు సభ్యులు

ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు కీలక సభ్యుల పదవీకాలం జూన్ 26తో ముగియనుండటంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. పదవీకాలం ముగిసే వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అయోధ్య రామిరెడ్డి, రిలయన్స్ గ్రూప్ ప్రతినిధి పరిమళ్ నత్వానీతో పాటు సీనియర్ నేత పిల్లి సుభాష్ చంద్రబోస్, సానా సతీష్ ఉన్నారు. ఈ నలుగురి స్థానంలో కొత్తగా పెద్దల సభలోకి అడుగుపెట్టబోయే ఆ నలుగురు నాయకులు ఎవరనే ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# కాక్‌రోచ్ జనతా పార్టీలో ప్రకాష్ రాజ్ ఎంట్రీ..

మొదటి పేజీ తరువాయి




ఈ వీడియోలో ప్రకాష్ రాజ్ ఐస్‌క్రీమ్‌లో మామిడి పండు గుజ్జును కలుపుకుని తింటూ కనిపించారు. దానికి ఆయన పెట్టిన క్యాప్షన్, చేసిన కామెంట్లు ఈ వ్యంగ్య రాజకీయ ఉద్యమానికి మరింత హైప్‌ను తీసుకొచ్చాయి. "బొద్దింకలు మామిడి పండ్లను ఎలా తింటాయో చూడండి" అంటూ ప్రధానమంత్రికి ఇష్టమైన పండుగా చెప్పుకునే మామిడి పండును తింటూ ప్రకాశ్‌రాజ్ ఈ సెటైరికల్ జిల్లేడును విసిరారు. "కాక్‌రోచ్ ఈటింగ్ మ్యాంగోస్.. యమ్మీ" అంటూ #CockroachJantaParty, తన మార్క్ హ్యాష్‌ట్యాగ్ #justasking జత చేసి ఈ వీడియోను పోస్ట్ చేశారు. 61 ఏళ్ల ప్రకాష్ రాజ్ మొదటి నుంచీ ఈ పార్టీ సోషల్ మీడియా అకౌంట్లను ఫాలో అవ్వడమే కాకుండా.. వాటి పోస్టులను షేర్ చేస్తూ యువత గొంతుకను మరింత మందికి చేరువ చేస్తున్నారు.

ఈ సరికొత్త ఆన్‌లైన్ ట్రెండ్ కేవలం ప్రకాష్ రాజ్‌తోనే ఆగిపోలేదు. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్, నటీమణులు దియా మీర్జా, ఈషా గుప్తా, ఫాతిమా సనా షేక్, దర్శకుడు కునాల్ కోహ్లీ వంటి పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ కాక్‌రోచ్ జనతా పార్టీ అఫీషియల్ అకౌంట్లను సోషల్ మీడియాలో ఫాలో అవుతున్నారు. డిజిటల్ స్ట్రాటజిస్ట్ అభిజీత్ దీప్కే అనే 30 ఏళ్ల బోస్టన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ ప్రారంభించిన ఈ వ్యంగ్య ప్రచారం.. ఇంటర్నెట్‌లో ఒక చిన్న జోక్‌లా మొదలై ఇప్పుడు పెను తుఫాన్‌లా మారింది. మే 16న లాంచ్ అయిన ఈ కాక్‌రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజీ.. కేవలం ఆరు రోజుల్లోనే ఏకంగా 20 మిలియన్ల (2 కోట్లు) ఫాలోవర్ల మార్కును దాటేసి అందరినీ ఆశ్చర్యపరిచింది.

# తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ లైతే పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా?: సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి



కానీ, మీరు మాత్రం ఆ మినహాయింపుల్ని ప్రశ్నిస్తున్నారు. ఇది కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అంశం. విద్యా, ఆర్థికంగా సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు మళ్లీ తమ పిల్లలకు రిజర్వేషన్లు కోరుతున్నారు. ఇలాగే కొనసాగితే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేము. తల్లిదండ్రులు ఉన్నత స్థాయికి చేరిన తర్వాత పిల్లల పరిస్థితి కూడా మారుతుంది. రిజర్వేషన్ల అమలులో సమతుల్యత అవసరం" అని ఆ పిటిషన్ విచారణలో భాగంగా జస్టిస్ నాగరత్న అన్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్ధిపొంది సామాజిక, ఆర్థిక సాధికారిత తర్వాత తమ కుటుంబంలోని తర్వాతి తరానికి అదే రిజర్వేషన్ పొందే విషయంలో ఎవరికి వారు పునః పరిశీలించుకోవాలని కోర్టు అభిప్రాయపడింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

# యువతకు యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

## కాగిత గ్రామంలో పోలీసుల కౌన్సెలింగ్ కార్యక్రమం




అనకాపల్లి జిల్లా,నక్కపల్లి, మే 22: నక్కపల్లి మండలం కాగిత గ్రామంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం, మహిళల భద్రత మరియు సైబర్ క్రైమ్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నక్కపల్లి సిఐ జై మురళి నిర్వహించారు. గ్రామ యువతతో సమావేశమైన అధికారులు.. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర చెడు అలవాట్ల వల్ల యువత భవిష్యత్తు, ఆరోగ్యం, కుటుంబ జీవితంపై కలిగే దుష్ప్రభావాలపై వివరించారు.

కాగిత క్రికెట్ గ్రౌండ్ వద్ద నిర్వహించిన సమావేశంలో యువతకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి.. క్రీడలు, విద్య, మంచి అలవాట్ల వైపు దృష్టి సారించాలని సూచించారు.

ఈ సందర్భంగా సైబర్ మోసాలు, ఫేక్ లోన్ యాప్స్,ఓటిపి మోసాలు, సోషల్ మీడియా నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలను గౌరవించడం, మహిళల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

డ్రగ్స్ వినియోగం, విక్రయం, ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలను వివరించిన అధికారులు.. అనుమానాస్పద వ్యక్తులు, డ్రగ్స్ రవాణా, సైబర్ మోసాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ లావాదేవీలను సురక్షితంగా వినియోగించే విధానంపై అవగాహన కల్పించి.. యువత బాధ్యతాయుత పౌరులుగా మారి సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# 1 లేదా 2వ వార్డు లో ఉంచాలని వినతి...



భీమిలి (బీఎన్ఎస్): గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన వార్డుల పునర్విభజన ప్రక్రియ స్థానిక ప్రజల్లో తీవ్ర గందరగోళాన్ని, అశాంతిని రేపుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని 98 వార్డులను 120 వార్డులుగా విస్తరిస్తూ నూతన మ్యాప్‌ను విడుదల చేసింది. అయితే, ఈ భౌగోళిక మార్పులు క్షేత్రస్థాయిలో కొత్త సమస్యలకు దారితీశాయి.ంచిట్టివలస రెవెన్యూ పరిధిలోని చిల్లపేట, జీరుపేట గ్రామాలను అనాలోచితంగా భీమిలి జోన్ పరిధిలోకి మార్చారు.

ఈ మార్పు వల్ల భవిష్యత్తులో తీవ్ర పరిపాలనాపరమైన ఇబ్బందులు, స్థానిక సమస్యలు తలెత్తుతాయని ప్రజలు బేజారవుతున్నారు.

ప్రభుత్వం, జీవిఎంసి అధికారులు తక్షణమే స్పందించి ఈ తప్పును సరిదిద్దాలని స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. చిల్లపేట, జీరుపేట గ్రామాలను 1వ వార్డులో కలపాలని లేదా యథావిధిగా 2వ వార్డులోనే కొనసాగించాలని కోరుతూ గురువారం భీమిలి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చిల్ల బాస్కర్ రెడ్డి, జీరు వెంకట రెడ్డి, బింగి హరి కిరణ్ రెడ్డి, జే.కె రెడ్డి, కే.ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రజల పక్షాన గళం విప్పారు.

# కలువాయిలో ఘనంగా శివరాజయోగి గురు ప్రాణలింగ దీక్ష మహోత్సవం




నెల్లూరు జిల్లా కలువాయి (బి.యన్.యస్):– నెల్లూరు జిల్లా కలువాయి మండల కేంద్రంలో నిర్వహించిన 'శివరాజయోగి గురు ప్రాణలింగ దీక్ష -- ఓం నమఃశివాయ మహాప్రాణోపదేశం మహోత్సవం' అపూర్వ ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. స్థానిక ఉమామహేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన ఈ విశేష కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లాలోని రాజశ్యామల పీఠాధిపతి, ప్రముఖ శివయోగి బ్రహ్మదర్శి, బ్రహ్మవిద్వరన్ శివరాజయోగి కృష్ణ స్వామీజీ విచ్చేసి భక్తులకు గురు ప్రాణలింగ దీక్షను అనుగ్రహించారు.కృష్ణ స్వామీజీ ఈ సందర్భంగా స్వామీజీ భక్తులనుద్దేశించి దివ్యోపదేశం చేస్తూ గురువు అనేది కేవలం ఒక వ్యక్తి కాదు, అది అజ్ఞానాంధకారాన్ని తొలగించి జీవుడిని శివత్వానికి చేర్చే దివ్య చైతన్యం అని పేర్కొన్నారు. శివసాక్షాత్కారం పొందిన యోగి తన అంతరంగ దివ్యశక్తిని పవిత్ర లింగంలో నిక్షిప్తం చేసి శిష్యునికి అనుగ్రహించే అత్యున్నత ఆధ్యాత్మిక ప్రక్రియే 'గురు ప్రాణలింగ దీక్ష' అని ఆయన వివరించారు. ఈ ఆరాధన వల్ల మనసుకు ప్రశాంతత, శరీరానికి ఆరోగ్యం, కుటుంబానికి ఐశ్వర్యం, జీవితానికి దైవకృప లభిస్తాయని చెప్పారు. నేటి కలుషిత కాలంలో గురుకృప మాత్రమే మనిషిని ఆధ్యాత్మికంగా రక్షించగలదని, గురుభక్తి ద్వారానే జీవితం పవిత్రమవుతుందని స్పష్టం చేశారు.ఈ మహోత్సవానికి నెల్లూరు జిల్లాతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎన్నో రోజులుగా గురుదర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులు స్వామీజీ ఆశీస్సులు పొందుతూ ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తునికి పవిత్ర గురు ప్రాణలింగము, పంచముఖి రుద్రాక్షను ప్రసాదంగా అందజేశారు. అనంతరం భక్తుల వ్యక్తిగత, కుటుంబ, ఆధ్యాత్మిక సమస్యలకు గురువు ప్రత్యేక మార్గదర్శకత్వం వహించారు.మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. రోజంతా భక్తులు చేసిన "ఓం నమఃశివాయ" మహా మంత్ర నినాదాలతో కళ్యాణ మండప ప్రాంగణమంతా శివమయంగా మారింది.సమాజంలో ధర్మం, గురుభక్తి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు రాజశ్యామల పీఠం ఆధ్వర్యంలో ఇలాంటి మహాప్రాణవిద్య గురుదీక్ష వంటి మహోన్నత కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణారెడ్డి, ప్రముఖ జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ వెంకట్ శ్రావణ్, రమణారెడ్డి, దినేష్, గణేష్, వెంకట్ కుమార్ మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, ఆధ్యాత్మిక బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గంజాయి, డ్రగ్స్ పై కోనసీమ పోలీసుల ఉక్కుపాదం




అమలాపురం (బీఎన్ఎస్) మే :21 : కోనసీమ జిల్లా బయో చెక్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా, 10 మందికి మత్తు పదార్థాలు సేవించినట్లు పాజిటివ్ గా తేలిందన్నారు జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా ఐపీఎస్..ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతా గంజాయి,డ్రగ్స్ సేవించిన వారిని గుర్తించేందుకు అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్లతో కోనసీమ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించామని తెలిపారు.జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు రాజోలు పట్టణంలో కొత్తపేట డిఎస్పీ ఎస్.మురళీమోహన్, రాజోలు సీజీ సురేష్ బాబు, ఎసీ సీజీ పుల్లారావు అధ్వర్యంలో ప్రత్యేక సోదాలు చేశారు..

వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు డీ–అదిక్షన్ సెంటర్లకు తరలించి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు.గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం కొనసాగుతుందని .. సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవు" అని జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా ఐపీఎస్ హెచ్చరిక .

# పవన్ కళ్యాణ్ ఆరోగ్యానికి వారాహి అమ్మవారి ప్రత్యేక పూజలు

## దుష్ట శక్తుల నుంచి కాపాడాలని శివదత్ ప్రార్థనలు



అనకాపల్లి జిల్లా,మే 22 (బిఎన్ఎస్) పాయకరావుపేట : జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకోవాలని కోరుతూ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్,జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారాహి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అర్చనలు,హోమాలు నిర్వహించిన ఆయన..పవన్ కళ్యాణ్‌పై దుష్ట శక్తుల ప్రభావం లేకుండా అమ్మవారు కాపాడాలని ప్రార్థించారు.ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# రాంకీ జ్ఞాపకార్థం మెగా క్రికెట్ టోర్నీ ముగింపు

## విజేతలకు అవార్డులు.. వృద్ధాశ్రమంలో అన్నదానం



పాయకరావుపేట, మే 22: కరోనా మహమ్మారి సమయంలో మృతిచెంది దైవచెంతకు చేరిన ఆత్మీయ స్నేహితుడు కోరుకొండ రామకృష్ణ (రాంకీ) జ్ఞాపకార్థం ఆయన స్నేహితుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాంకీ మెగా క్రికెట్ టోర్నీ ఆదివారం ఘనంగా ముగిసింది. గత 20 రోజులుగా పాయకరావుపేట వాటర్ క్రాస్ గ్రౌండ్‌లో జరిగిన ఈ టోర్నీలో వివిధ జట్లు పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాయి.

ఫైనల్ మ్యాచ్‌లో మండి బుల్స్ మరియు రాజా ఎలేవెన్స్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో మండి బుల్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. రాజా ఎలేవెన్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను నిర్వాహకులు అందజేశారు.అనంతరం పెదరాంబద్రపురం శివారులోని శ్రీ సాయి అన్నపూర్ణ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు భోజనాలు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో రామకృష్ణ స్నేహితులు గొల్లపల్లి నాగు, దనిశెట్టి బాబి, గడ్డం చలపతి, లింగాల రాజు, కంటెం రంగ, బొక్కిస నాయుడు, రవీంద్ర, వి.సాయి, సునీల్ విశ్వాస్, జే.టిటానీ, అడపా బాలాజీ, జగన్నాథ రాజు, అక్బర్, శ్రీనివాస్, ఆనంద్, విజయ్, నూకరాజు, రిషి, నానాజీ, నూర్ భాష, మణికంఠ, బుజ్జి, కళ్యాణ్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తో భేటీ అయిన ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్



విజయవాడ..... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కు సంబంధించి ఇరువురు మధ్య చర్చ జరిగింది.కూటమి స్థానిక సంస్థల ఎన్నికల్లో అవలంబించాల్సిన అంశాలు ప్రస్తావించారు. అదేవిధంగా జూన్ 5 వతేదీ నుండి 21 వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12సం పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు విషయాన్ని కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకు తీసుకుని వెళ్ళాలి అని నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా అమ్మ పేరు తో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి కి మాధవ్ తీసుకుని వెళ్ళారు.జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు చర్చించారు.గత సంవత్సరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ లో పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీ నివాస్, బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ పాల్గొన్నారు

# పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం

- **జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**




అనకాపల్లి మే 22 : పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ మరియు ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుండి నిర్వహించబోయే పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు పగడ్బందీ గా ఏర్పాట్లు చేయాలని, పరీక్షలను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని రకాల వసతులు కల్పించాలని స్పష్టం చేశారు.

పరీక్షా కేంద్రాల పరిధిలో కఠినంగా 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు . ప్రశ్నాపత్రాల రవాణా సమయాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు (ఎస్కార్ట్) నిర్వహించాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారుల నుంచి పోలీస్ స్టేషన్ల వారీగా ప్రశ్నపత్రాల డేటాను సేకరించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పరీక్షలు జరిగే కేంద్రాలలో పూర్తి సమయం పనిచేసేలా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, ప్రతి క్యాంపులో కనీసం ముగ్గురు సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఒ.ఆర్.ఎస్ (ా=ా) ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశించారు.

పరీక్షలు ఒకే సెషన్ (ఉదయం) జరుగుతున్నందున, విద్యార్థులు ఉదయం కేంద్రాలకు చేరుకోవడానికి, తిరిగి మధ్యాహ్నం వెళ్ళడానికి వీలుగా బస్సు వేళలను సరిగ్గా సమయానుకూలంగా నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రాంతాలలో ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకూడదని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీటి వసతి, ప్రతి కేంద్రంలో శానిటేషన్ మరియు టాయిలెట్ల నిర్వహణ కోసం ఇద్దరు సిబ్బందిని, త్రాగునీటి సరఫరా కోసం ఇద్దరు సిబ్బందిని (మొత్తం నలుగురు) విధుల్లో ఉంచాలని ఎంపీడీవోలను/ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

ప్రశ్నాపత్రాల పంపిణీ మరియు సమన్వయంలో పోస్టల్ సూపరింటెండెంట్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రెజరీ, పోస్టల్, పోలీస్ శాఖలు అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా ప్రశ్నాపత్రాల లీకేజీ అయినట్లు తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు గానీ, టీచర్లు గానీ ఇన్విజిలేటర్లను సంప్రదించి అక్రమాలకు పాల్పడాలని చూస్తే, అలాంటి వారిపై వెంటనే ఖీ×= (క్రిమినల్ కేసులు) నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు కొద్దిగా ఆలస్యంగా వచ్చినా (5–10 నిమిషాలు) మానవతా దృక్పథంతో గ్రేస్ టైం ఇచ్చి పరీక్షకు అనుమతించాలన్నారు. అధికారుల ప్రవర్తన వల్ల విద్యార్థులు ఇబ్బంది పడకూడదు. అయితే, ఎలాంటి కాపీయింగ్ (బిట్ పేపర్లు) పదార్థాలను లోపలికి అనుమతించరాదని, పరీక్షల నిర్వహణలో పాల్గొనే ప్రతి ఒక్క అధికారి మరియు సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

# ఒక్క జేసీబీతో 20 కుటుంబాల బతుకులు బూడిద

## నోటీసు లేకుండానే చిరు దుకాణాల కూల్చివేత

## కన్నీటిలో మునిగిన స్ట్రీట్ వెండర్లు.. అధికారుల తీరుపై ఆగ్రహం




శేరిలింగంపల్లి – ( బిఎన్ఎస్ ): "ఉదయం దుకాణం తెరిచేసరికి జేసీబీ వచ్చింది.. ఒక్క మాట కూడా చెప్పకుండా మా బతుకులనే తుక్కుతుక్కు చేసి వెళ్లిపోయారు" అంటూ చందానగర్ ప్రాంతానికి చెందిన స్ట్రీట్ వెండర్లు కన్నీరుమున్నీరయ్యారు.

మియాపూర్ సర్కిల్ పరిధిలోని సరస్వతి విద్యా మందిరం నుంచి పీజేఆర్ స్టేడియం వెళ్లే మార్గంలో రోజువారీ జీవనోపాధిగా బండి, డబ్బా పెట్టుకుని వ్యాపారం చేస్తున్న సుమారు 20 కుటుంబాలు గురువారం ఒక్కసారిగా రోడ్డున పడ్డాయి.

టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా జేసీబీలతో దుకాణాలను కూల్చివేయడంతో బాధితుల పరిస్థితి దయనీయంగా మారింది.

సంవత్సరాలుగా అక్కడే వ్యాపారం చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నామని, కనీసం ముందుగా సమాచారం ఇచ్చి ఉంటే సామాన్లు సర్దుకునే అవకాశం ఉండేదని బాధితులు వాపోయారు.

"పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి.. ఇంటి అద్దె చెల్లించాలి.. ఈ చిన్న డబ్బానే మా జీవితం. ఇప్పుడు మేమెలా బతకాలి?" అంటూ ఓ మహిళా వెండర్ రోదించిన దృశ్యాలు అక్కడివారిని కంటతడి పెట్టించాయి.

ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు శుక్రవారం మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖను కలిసి వినతిపత్రం అందజేశారు.

"మమ్మల్ని ఆక్రమణదారులుగా చూడొద్దు. మాకు వెండింగ్ జోన్ కేటాయించండి.. లేదా ప్రత్యామ్నాయ స్థలం చూపించండి. అధికారుల తీరుపై విచారణ జరిపి న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు.

స్థానికులు కూడా అధికారుల వ్యవహారశైలిపై మండిపడ్డారు. "పేదల పొట్టకొట్టడం అన్యాయం. తొలగించే ముందు కనీసం వారం రోజుల గడువు ఇచ్చినా వాళ్లు సామాన్లు తరలించుకునేవారు. ఇలా జేసీబీలతో తొక్కించడం కర్కశం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్ట్రీట్ వెండర్ల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చినా క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదని, అధికారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పాఠశాలల ట్రాఫిక్‌కు చెక్.. 'స్టూడెంట్ మొబిలిటీ ప్లాన్'కు శ్రీకారం

## 500 విద్యాసంస్థలతో సైబరాబాద్ పోలీసుల భారీ సమావేశం

## టెక్నాలజీతో ట్రాఫిక్, విద్యార్థుల భద్రత సమస్యలకు పరిష్కారం




సైబరాబాద్ – ( బిఎన్ఎస్ ):పాఠశాలలు, కళాశాలల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో నెలకొంటున్న తీవ్ర ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్తంగా 'స్టూడెంట్ మొబిలిటీ ప్లాన్'ను రూపొందించాయి.

ఈ ప్రణాళికలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఈఎస్‌సీఐ సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో 500కు పైగా విద్యాసంస్థలకు చెందిన 750 మంది ప్రతినిధులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు.

టీజీఎస్‌ఆర్టీసీ, ఆర్టీఏ, విద్యాశాఖ అధికారులు, రవాణా ఆపరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విద్యార్థుల రాకపోకలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ బృందాలు కలిసి 526 విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాయి. మొత్తం 4.1 లక్షల మంది విద్యార్థుల ప్రయాణ విధానాన్ని విశ్లేషించగా కీలక విషయాలు వెలుగుచూశాయి. 80 శాతం విద్యాసంస్థలు బస్సు సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ కేవలం 30 శాతం మంది విద్యార్థులే వాటిని వినియోగిస్తున్నట్లు తేలింది.

దీంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు రెండు లక్షల ప్రైవేటు వాహనాలు పాఠశాలల వద్దకు చేరుతున్నాయని అధికారులు గుర్తించారు. పీక్ టైంలో కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే రెండు లక్షల వాహనాలు రోడ్డెక్కడం సైబరాబాద్ ఐటీ కారిడార్ ట్రాఫిక్‌ను మించిపోతున్నదని వెల్లడించారు.

ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేశ్ మాట్లాడుతూ పిల్లలను పాఠశాలలకు దింపేందుకు, తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు తొందరపడి ప్రమాదకరంగా వాహనాలు నడుపుతున్నారని, దీంతో ప్రమాదాలు, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచార లోపం కారణంగా పిల్లలు పాఠశాలల్లో చిక్కుకుపోవడం, ఉదయం హడావుడిలో పిల్లల ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇది కేవలం ట్రాఫిక్ సమస్య కాదని, దీర్ఘకాలిక పౌర రవాణా సంస్కరణ అవసరమని స్పష్టం చేశారు.

ప్రస్తుతం పూర్తిగా వినియోగంలో లేని ప్రభుత్వ, ప్రైవేటు రవాణా సామర్థ్యాన్ని ఉపయోగించి పూల్డ్ మొబిలిటీని ప్రోత్సహిస్తామని, పాఠశాలలకు వచ్చే అన్ని వాహనాలు నిబంధనలకు లోబడి ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతేకాకుండా లాస్ట్ మైల్ కనెక్టివిటీలో గిగ్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందిని భాగస్వామ్యం చేసి విద్యార్థుల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు వారికి అదనపు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

కార్యక్రమంలో డీసీపీలు రితిరాజ్, సృజన, శేషాద్రిని రెడ్డి, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఈఎస్‌సీఐ డైరెక్టర్ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యాసంస్థల ప్రతినిధుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

రద్దీ, భద్రత, నియమాల అమలు, సౌలభ్యం అనే నాలుగు కీలక అంశాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేలా రూపొందించిన టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌ను దశలవారీగా అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# నడిగడ్డ తాండలో విద్యుత్ కష్టాలు తీర్చండి



శేరిలింగంపల్లి – ( బిఎన్ఎస్ ): నడిగడ్డ తాండలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం ఎలక్ట్రికల్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. తాండాలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు చాలా వరకు శిథిలావస్థకు చేరి వంగిపోయాయని, వర్షాకాలంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని సంఘం నాయకులు తెలిపారు. "వాటి స్థానంలో వెంటనే కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి. కొన్ని స్తంభాలు నివాస గృహాల లోపల ఉండటంతో ఇంటి నిర్మాణాలకు, ప్రజలకు ఇబ్బందిగా ఉంది. వాటిని తొలగించి రోడ్డు పక్కన లైన్‌లోకి మార్చాలి. ఇప్పటికీ కొన్ని ఇళ్లకు విద్యుత్ మీటర్లు లేవు. అర్హులైన వారికి వెంటనే కొత్త మీటర్లు మంజూరు చేసి ఇంటింటికీ విద్యుత్ సరఫరా కల్పించాలి" అని వినతిపత్రంలో పేర్కొన్నారు.సమస్యలను విన్న ఏఈ సానుకూలంగా స్పందించి, స్వయంగా తాండాను పరిశీలించి పై సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నడిగడ్డ తాండ అధ్యక్షుడు సభవత్ హన్మ నాయక్, గౌరవ అధ్యక్షుడు ఎం. రెడ్యానాయక్, కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్, ఉపాధ్యక్షుడు నాయిని రత్నకుమార్, సభ్యులు కాట్రావత్ శంకర్ నాయక్, అంగోత్ మోతిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఆడపిల్లల పరువుతో ఆటలు ఆపాలి'.. యూట్యూబ్ ఛానల్‌పై విష్ణుప్రియ ఫైర్

- మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- 'ఇక ఎవరినీ వదిలేది లేదు' అంటూ హెచ్చరిక



శేరిలింగంపల్లి –( బిఎన్ఎస్): సోషల్ మీడియాలో మహిళా సెలబ్రిటీలపై జరుగుతున్న క్యారెక్టర్ అస్సాసినేషన్‌కు వ్యతిరేకంగా బుల్లితెర నటి, యాంకర్ విష్ణుప్రియ భీమనేని న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్న 'ప్లే లైక్ ఇంకాగ్నిటో' యూట్యూబ్ ఛానల్‌పై శుక్రవారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ.. "ఏడ్చి ఏడ్చి విసిగిపోయా.. ఇక మౌనం ఉండేది లేదు. ఒక అమ్మాయి అయ్యుండి మరో అమ్మాయిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. తప్పుడు సమాచారాన్ని నిజంలా చూపిస్తూ వ్యక్తిత్వ హత్య చేస్తున్నారు. అందుకే చట్టపరమైన చర్యలకు దిగాను. ఇది నా ఒక్కదాని సమస్య కాదు.. ఇండస్ట్రీలోని ప్రతి ఆడపిల్ల సమస్య" అని ఆవేదన వ్యక్తం చేశారు.

"ప్రజలను అలరించడానికి మేము కష్టపడుతున్నాం. కానీ కొందరు వ్యూస్, డబ్బుల కోసం మహిళల పరువుతో ఆటలాడుతున్నారు. తప్పు చేస్తే విమర్శించండి.. కానీ వ్యక్తిత్వాన్ని కించపరచేలా మాట్లాడటం అమానుషం. ఇకపై ఇలాంటి ప్రచారం చేస్తే ఆయా ఛానల్స్‌పై కఠిన చర్యలు తీసుకునేలా పోరాడతాం" అని హెచ్చరించారు.

మహిళా కళాకారుల పరువుకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న సోషల్ మీడియా ఛానల్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మియాపూర్ సీఐ తెలిపారు. విష్ణుప్రియ ఫిర్యాదుకు సినీ పరిశ్రమకు చెందిన పలువురు మద్దతు ప్రకటిస్తున్నారు.

# వీధి ఆహార విక్రేతలకు భద్రతా బాట.. 110 మందికి శిక్షణ

- ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమం
- ధ్రువపత్రాలు, పరిశుభ్రత కిట్ల పంపిణీ




శేరిలింగంపల్లి, (బిఎన్ఎస్): శేరిలింగంపల్లి మండల పరిధిలోని 110 మంది వీధి ఆహార విక్రేతలకు ఆహార భద్రతపై శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పాలనాధికారి నారాయన్ అమిత్, అదనపు పాలనాధికారి సుభద్రదేవి, మండల ఆహార భద్రత అధికారుల ఆధ్వర్యంలో ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం--2006 ప్రకారం ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆహార తయారీలో పరిశుభ్రత, సురక్షిత నిల్వ విధానాలు, వ్యక్తిగత శుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై విక్రేతలకు అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం నిర్వహించిన 'ఆహార భద్రత పర్యవేక్షకుడు' పరీక్షలో ఉత్తీర్ణులైన విక్రేతలకు ధ్రువపత్రాలు అందజేశారు.అలాగే గ్లౌజులు, టోపీలు, ఆప్రాన్లు, సబ్బులు, చెత్తబుట్టలతో కూడిన పరిశుభ్రత కిట్లను అధికారులు పంపిణీ చేశారు. దేశీయ ఆహార సంస్థ, భారత వీధి విక్రేతల జాతీయ సంఘం సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

వీధి ఆహారాన్ని మరింత నాణ్యంగా, పరిశుభ్రంగా ప్రజలకు అందించడంతో పాటు విక్రేతల ఆదాయం పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని మండల పాలనాధికారి నారాయన్ అమిత్ తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది విక్రేతలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

# జై రమేశ్ 80వ జన్మదిన వేడుకలు.. రక్తదానంతో సేవా సందేశం

- టీసీసీ క్లబ్‌లో ఘనంగా శిబిరం నిర్వహణ
- పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభం



శేరిలింగంపల్లి, ( బిఎన్ఎస్ ): విద్యుత్ రంగంలో విశిష్ట సేవలు అందించిన విజయ్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సీఎండీ దాసరి జై రమేశ్ 80వ జన్మదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని టీసీసీ క్లబ్‌లో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయ్ ఎలక్ట్రికల్స్ పూర్వ కార్మికులు, ఉద్యోగులు సాంబమూర్తి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిన జై రమేశ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 40 మంది రక్తదానం చేయడం గొప్ప విషయమని, రక్తదాతలు ప్రాణదాతలని కొనియాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుత కాలంలో ఆరోగ్యం వ్యాపారంగా మారుతున్న నేపథ్యంలో సామాజిక బాధ్యతతో రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లిఖార్జున, కార్మిక నాయకుడు సుదర్శన్, విజయ్ ఎలక్ట్రికల్స్ పూర్వ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెంచలకోనలో హుండీ లెక్కింపు

## 80 లక్షలు హుండీ ఆదాయం



నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):- నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో ముగిసిన శ్రీ పెనుశిల లక్ష్మీ నృసింహ స్వామి వారి హుండీ లెక్కింపు.గత 30 రోజులకు (ఏప్రిల్ 23 నుండి మే 22 వరకు) గాను స్వామివారికి అపారమైన హుండీ లెక్కింపు ద్వారా ఆదాయం భక్తులు సమర్పించారు.

హుండీ లెక్కింపు ద్వారా రికార్డు స్థాయిలో రూ. 84,51,724 నగదుతో పాటు 60 గ్రాముల 500 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారు ఆభరణాలు భక్తులు సమర్పించారు.అదేవిధంగా కిలో 550 గ్రాముల వెండి ఆభరణాలను స్వామివారికి హుండీలో వేశారు.హుండీలో భారీగా లభ్యమైన విదేశీ కరెన్సీ --- అమెరికా, కువైట్, యూఏఈ, ఖతార్, సింగపూర్, నేపాల్, ఆర్మేనియా దేశాల కరెన్సీ గుర్తించారు.ఆలయ హుండీ లెక్కింపు ప్రక్రియను అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నిర్వహించారు.లెక్కింపులో ఆలయ ఉప కమీషనర్ & కార్యనిర్వహణాధికారి (FAC) కోవూరు జనార్దన్ రెడ్డి, ప్రధాన అర్చకులు మరియు ఆలయ సిబ్బంది.భద్రతా చర్యల్లో భాగంగా లెక్కింపులో పాల్గొన్న పెంచలకోన అవుట్ పోస్ట్ పోలీసులు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ & సిబ్బంది.హుండీ ద్వారా వచ్చిన మొత్తం నగదును పెంచలకోన బ్రాంచ్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు ఈఓ జనార్దన్ రెడ్డి తెలిపారు.

# సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది



అమరావతి ,మే 22(బి.యన్.యస్) :రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు గారి లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లాలో రెండు రోజు పర్యటనలో భాగంగా ముందుగా జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు మండలం పెనికలపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మంత్రి లోకేష్ సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో సంభాషించారు. ముందుగా సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు రైతు ద్వారకానాథ్ రెడ్డి, ఆయన సతీమణి రాఘవేంద్రవతిలు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా రైతు ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మంత్రి సంభాషించారు. ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడానికి గల కారణాలను మంత్రి లోకేష్ అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో 70 ఏళ్ల వయస్సున్న సేంద్రియ రైతు లక్ష్మీనారాయణను స్ఫూర్తిగా తీసుకుని తాము సేంద్రియ సాగు చేస్తున్నామని వివరించారు. మొదట ఒడిదొడుకులు ఎదుర్కొన్నా.. వ్యవసాయ అధికారుల ప్రోత్సాహంతో నిలదొక్కుకున్నామని చెప్పారు. వ్యవసాయ అధికారులు సేంద్రియ సాగులో మెళకువలపై తిరుపతిలో శిక్షణ అందించారని, బయో రీసెర్చ్ సెంటర్ కేటాయించారని తెలిపారు. తమ పొలంలోనే సహజ ఎరువులు, 32 రకాల జీవ వైవిధ్య గింజల తయారీ చేపట్టినట్లు వివరించారు. పురుగుమందులు, రసాయన ఎరువులు అవసరం ఇప్పుడు తమకు లేదన్నారు. పంట పెట్టుబడి తగ్గిపోవడంతో సమీకృత సేంద్రీయ సాగు ద్వారా నెలవారీ ఆదాయం పొందుతున్నామన్నారు. ఒక్క ఆవుతోనే 20 ఎకరాల వరకు సేంద్రియ సాగు చేపట్టవచ్చని తెలిపారు. 250 నాటుకోళ్ల పెంపకం ద్వారా పొలంలో కలుపు తీసే పనిలేదని, పురుగుమందుల అవసరం లేదని వివరించారు. తమ వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న మామిడి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఆదాయం పొందుతున్నామని చెప్పారు. ప్రభుత్వ పరంగా మరింత సహకారం అందిస్తే ప్రకృతి వ్యవసాయంలో అద్భుతాలు చేయవచ్చని ధీమావ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ స్పందిస్తూ .. పంట పొలాల్లో అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం ద్వారా భూసారం దెబ్బతినడంతో పాటు రైతుకు సాగు పెట్టుబడి వ్యయం అధికమవుతోందన్నారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు గారి లక్ష్యమని వివరించారు. రాష్ట్రంలోని రైతులను సేంద్రియ సాగువైపు మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం కూడా ఇందుకు కృషిచేస్తోందని వివరించారు. చిరుధాన్యాల సాగును కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాయలసీమలో బిందు సేద్యానికి మరింత అండగా ఉంటున్నామని, గొలుసుకట్టు చెరువుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు స్థానిక రైతులను అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు ప్రభుత్వం కూడా మద్దతుగా ఉంటుందన్నారు. వ్యవసాయ క్షేత్రం మొత్తం కలియతిరిగి వివిధ పంటల సాగును మంత్రి పరిశీలించారు. అనంతరం 32 లక్షల లీటర్ల సామర్థ్యమున్న నీటి కుంటను మంత్రి పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీకృత సేంద్రియ సాగులో అద్భుతాలు సృష్టిస్తూ.. స్థిరమైన ఆదాయం పొందుతున్న మునగాల ద్వారకానాథ్ రెడ్డి, కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన మామిడిని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రుచి చూశారు. అనంతరం రైతు ద్వారకానాథ రెడ్డి కుటుంబం మంత్రి లోకేష్ కు మామిడి పండ్లను బహుమతిగా అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి ఫోటోలు దిగారు.

ఈ కార్యక్రమంలో రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, ఆయన సతీమణి రాఘవేంద్రవతి, ద్వారకానాథ రెడ్డి సోదరుడు రమణారెడ్డి, ద్వారకానాథ రెడ్డి మాతృమూర్తి నారాయణమ్మ, రమణారెడ్డి కుమారుడు విఘ్నేశ్వర్ రెడ్డి, కుమార్తె జ్యోతికా రెడ్డి పాల్గొన్నారు.

# బి.యల్.ఏ పదవి కాదు.. కీలక బాధ్యత -వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

## 20 నుంచి 25 ఏళ్లకోసారి జరిగే ఎస్ఐఆర్ అత్యంత కీలక ప్రక్రియ : తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(బి.యన్.యస్)ఉమ్మడి నెల్లూరు జిల్లావైయస్సార్సీపి బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమం శుక్రవారం స్థానిక వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసం ఎన్ జె ఆర్ భవన్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న నేదురుమ ల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి లు మాట్లాడుతూ అర్హుల ఓట్లు కాపాడుతూ.. అనర్హుల పేర్లు తొలగించాలా ఎనుము రేషన్ ఫారాలు, రాతపూర్వకంగా ఫిర్యాదులు సంబంధిత అధికారులకు అందించాలని తెలియజేశారు.

ఓటర్ల జాబితా సవరణలో బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి అని సూచించారు.అదేవిధంగా వైఎస్ఆర్సిపి హయాంలో కార్యకర్తలు ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారన్నారు.టిడిపి కార్యకర్తలు తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగాఇంటింటికీ వెళ్లే పార్టీ బిఎల్ఎ లు జగన్ పాలన -- టిడిపి పాలన తేడాలు వివరించాలి అని తెలిపారు.అదేవిధంగా దొంగ ఓట్లు చేరినా.. అర్హుల ఓట్లు తొలగినా బాధ్యత బిఎల్ఏలదే అని స్పష్టం చేశారు.

# చెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై పోలీసుల దాడులు

## మూడు ట్రాక్టర్లు సీజ్.. మైన్స్ అధికారులకు నివేదిక




అనకాపల్లి జిల్లా,నక్కపల్లి, మే 21: ఉద్ధండపురం గ్రామ చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో నక్కపల్లి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నక్కపల్లి సీఐ జె. మురళి ఆదేశాల మేరకు వెళ్లిన పోలీసు సిబ్బంది మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం ఏడి మైన్స్ అధికారులకు నివేదిక పంపినట్లు పోలీసులు తెలిపారు. చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.